

టన్ను చీనీ రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.28 వేలు, కనిష్టంగా రూ.12 వేలు, సరాసరిన రూ.20 వేల ప్రకారం పలికాయి.



కిలో టమాట రూ.18

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాటా గరిష్టంగా రూ.18 మేర పలికింది. మార్కెట్‌కు 2,100 టన్నుల సరుకు అమ్మకానికి వచ్చింది.

గరిష్టం/కనిష్టం
35.1°/17.8°

జిల్లా పరిధిలో గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఉదయం పూట చలి వాతావరణం నెలకొంది. గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పకడ్బందీగా కుల గణన



కుల గణనపై సమావేశమైన అధికారులు

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కుల గణనలో భాగంగా ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను సేకరించాలని ప్రత్యేకాధికారి శుభదాస్ పేర్కొన్నారు. కుల గణనపై గురువారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదట వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కుల గణనపై సమాచారం ఇస్తారని పేర్కొన్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి కులాలు, ఉప కులాలతో పాటు ప్రభుత్వం ఇచ్చిన 20 వివరాలతో కూడిన ప్రతిని నింపాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో ఏ ఒక్క కుటుంబాన్నీ వదలకుండా జల్లెడ పట్టాలన్నారు. ఈనెల 27 నుంచి పకడ్బందీగా కుల గణన చేయాలన్నారు. దీంతో పాటు ఏదైనా ప్రభుత్వ సంక్షేమ పథకం అందుకున్నా వాటి వివరాలను సైతం నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీనరసమ్మ, తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి, ఏఓ వెంకటబ్రహ్మం , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లక్కీడిప్ ద్వారా బహుమతులు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవంలో భాగంగా గురువారం జిల్లా ప్రజా రవాణా అధికారి టి. మధుసూదన్ సమక్షంలో ధర్మవరం బస్టాండ్ ఆవరణంలో లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేశారు. మొదటి విజేతగా జీఎస్ రెడ్డి, ద్వితీయ విజేతగా మంజు ఎంపికయ్యారు. విజేతలకు ధరణీ సిల్క్, మాంగళ్య సిల్క్ సౌజన్యంతో పట్టు చీరలు అందించారు. కార్యక్రమంలో పుట్టపర్తి డిపో కార్యాలయం ఎస్‌టీఐ షాషా వలి, ధర్మవరం డిపో ఏఈ సికిందర్, ట్రాఫిక్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, ఆఫీస్ సూపరింటెండెంట్ ప్రేమ్‌కుమార్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కేవీ నాగార్జునరెడ్డి, డిపో కార్యదర్శి జె. ముస్తఫా, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కేఆర్ఎం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


'రాగి' కొనుగోలు కేంద్రం ప్రారంభం



కోడూరులో రాగుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

చిలమత్తూరు: మండలంలోని కోడూరు థామస్ మన్రో తోపులోని ఆర్బీకేలో రాగిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ అశ్వర్థనారాయణ నాయక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగానే రాగులు క్వింటాల్‌కు రూ.3,846 మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందన్నారు. కోడూరు-1 పరిధిలో రైతుల వద్ద నుంచి 30 క్వింటాళ్ల రాగులను కొనుగోలు చేశారు. దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ హనుమంతరెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఏఓ వంశీకృష్ణ, సర్పంచ్ మురళీమోహన్, ఎంపీటీసీలు మంజునాథ్‌రెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు




స్టాక్ పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

హిందూపురం: పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో గురువారం ఉదయం అనంతపురం విజిలెన్స్ సీఐ వెంకటరమణ, ఏఓ వాసుప్రకాష్, స్థానిక వ్యవసాధికారి సురేంద్రనాయక్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పురుగుల మందు స్టాక్ రిజిస్టర్, నిల్వ ఉన్న మందు వివరాలు పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేని దుకాణదారులకు నోటీసులు జారీ చేశారు.

బడుగులతో బంతాట..!

- టీడీపీలో అగ్రవర్ణాలదే పెత్తనం
- ఉనికి కోసం బడుగు బలహీన వర్గాల నిత్య పోరాటం
- రిజర్వుడు నియోజకవర్గాల్లోనూ అగ్రకులాల నేతలు చెప్పిందే వేదం
- టూమెన్ కమిటీతో శింగనమలలో శ్రావణిని పక్కకు నెట్టిన వైనం
- మడకశిరలో గుండుమల కనుసన్నల్లోనే పార్టీ వ్యవహారాలు
- కదిరి నియోజకవర్గంలో మైనార్టీ మాట.. చెల్లని రూక
- అవమానాలు ఓర్వలేక తలోదారి చూసుకుంటున్న నాయకులు

అధికారంలో ఉన్నప్పుడే కాదు.. విపక్షంలోనూ బడుగు, బలహీన వర్గాల పట్ల చంద్రబాబు చిన్న చూపు ప్రదర్శిస్తున్నారు. అగ్ర కులాల వారే పెత్తనం చెలాయించేలా చూస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలతో బంతాట ఆడుతూ అడుగడుగునా అవమానాలకు గురి చేస్తున్నారు. టీడీపీ పెత్తందార్ల పార్టీనే అని నిరూపిస్తున్నారు. జిల్లాలో పలు నియోజకవర్గాల్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు.. చంద్రబాబు, చినబాబు లోకేష్‌ల ద్వంద్వ వైఖరిని చెప్పకనే చెప్పేస్తున్నాయి.



సాక్షి ప్రతినిధి, అనంతపురం: పేదలు, బడుగు బలహీన వర్గాల కోసమని ఎన్టీ రామారావు తెలుగు దేశం పార్టీని స్థాపించారు. చెప్పినట్లుగానే పెద్దపీట వేసి సముచిత స్థానం కల్పించారు. ఆయనకు వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కున్న చంద్రబాబు.. ఎన్టీఆర్ సిద్ధాంతాలకు ఫుల్ స్టాప్ పెట్టారు. పార్టీని క్రమంగా పెత్తందార్లకు అడ్డాగా మార్చారు. టీడీపీలో రాజకీయంగా ఎదగాలంటే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నేతలు నిత్యం పోరాటం చేయాల్సిన పరిస్థితి. ఆత్మాభిమానం చంపుకోలేక ఎంతో మంది ద్వితీయ శ్రేణి నాయకులు పార్టీ నుంచి బయటకు వస్తున్నారు.

శింగనమలలో దారుణంగా..

ఎస్సీలకు కేటాయించిన రిజర్వుడు స్థానాల్లోనూ టీడీపీకి చెందిన అగ్రకులాల నేతలు పెత్తనం చెలాయిస్తున్నారు. శింగనమల నియోజకవర్గంలో ఎస్సీ అభ్యర్థి పరిస్థితి గమనిస్తే ఈ విషయం స్పష్టంగా అవగతమవుతుంది. తెలుగుదేశం పార్టీ నేత బండారు శ్రావణిని ఇక్కడ డమ్మీగా మార్చారు. టూమెన్ కమిటీ పేరుతో ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసనాయుడును నియమించి అవమానించారు. వీళ్లు చెప్పినట్టే అక్కడ పనులు జరుగుతున్నాయి. ఇటీవల శ్రావణి తండ్రిపై దాడి జరిగింది. ఆ సమయంలో 'యువగళం' పాదయాత్రలో భాగంగా లోకేష్ జిల్లాలోనే ఉన్నారు. దాడికి పాల్పడిన వారిని మందలించనూ లేదు. దెబ్బలు తిన్న వ్యక్తిని పరామర్శించనూ లేదు.

గుండుమల.. ఎస్సీ నేతల విలవిల

మడకశిర ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం. ఇక్కడ మైనింగ్ మాఫియాకు అధిపతిగా చెప్పుకునే గుండుమల తిప్పేస్వామిదే పెత్తనం. ఆయన నియంత వైఖరిని జీర్ణించుకోలేని ఈరన్న వర్గానికి చెందిన ఎస్సీ నాయకులు పార్టీకి ఆమడదూరం వెళ్లిపోయారు. డబ్బున్న వాళ్లే రాజకీయాలు చేస్తున్నారని, ఎస్సీలను పట్టించుకునే నాథుడే లేరని ఉన్న కొద్దిపాటి ద్వితీయశ్రేణి నాయకులు వాపోతున్నారు. ఇప్పటికే పలు సామాజిక వర్గాల నేతలు పార్టీ నుంచి బయటకు వచ్చేశారు. ఇక్కడ పార్టీకి పరిస్థితి ఏ మాత్రం అనుకూలంగా లేదన్న సర్వేలు అధిష్టానానికి వెళ్లినట్లు తెలిసింది.

మైనార్టీ మాట చెల్లని రూక..

2014లో జరిగిన ఎన్నికల్లో కదిరిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున అత్తార్ చాంద్‌బాషా గెలిచారు. ఆ తర్వాత టీడీపీలోకి వెళ్లారు. ఇప్పుడాయన మాట చెల్లని రూక అయింది. డీజీల కుంభకోణంలో శిక్ష పడిన కందికుంట ప్రసాద్ మాటే పైచేయిగా మారింది. నేరాలకు తెగబడుతున్నా కందికుంటనే చంద్రబాబు, లోకేష్ ప్రోత్సహిస్తున్నారనేది బహిరంగ రహస్యమే. దీంతో ఇక్కడ మైనార్టీలు తెలుగుదేశం పార్టీపై మండిపడుతున్నారు.

అంతటా అంతే..

ఉమ్మడి జిల్లాలో అన్ని చోట్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నాయకుల మాట చెల్లడం లేదు. అధికారంలో ఉన్నప్పుడూ.. ఇప్పుడూ అగ్ర కులాల వారు పెత్తనం చెలాయిస్తుండడంతో రగిలిపోతున్నారు. ఇక.. ఎన్నికల ముందు చెప్పినట్లుగానే అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్ అన్ని సామాజిక వర్గాలకు సముచితం స్థానం కల్పించారు. పెద్ద ఎత్తున రాజకీయంగానూ పదవులు కట్టబెట్టారు. చెప్పాడంటే.. చేస్తాడంటే అనేంతలా పేరు తెచ్చుకున్నారు. అన్ని వర్గాల మనసులనూ గెలుచుకున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన టీడీపీలోని బడుగు బలహీన వర్గాల నాయకులు ఇప్పటికే పలు చోట్ల అధికార పార్టీలో చేరుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వలసల తాకిడి మరింత ఎక్కువయ్యేలా కనిపిస్తోంది. టీడీపీకి బడుగు బలహీన వర్గాల నేతలు గట్టి షాక్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

పుట్టపర్తికి ప్రత్యేక బస్సు సర్వీసులు



సిబ్బందితో మాట్లాడుతున్న ప్రజారవాణాధికారి మధుసూదన్

పుట్టపర్తి టౌన్: సత్యసాయిబాబా 98వ జయంత్యుత్సవాలను పురస్కరించుకొని ఈనెల 22, 23, 24 తేదీల్లో పుట్టపర్తి నుంచి అనేక ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు ప్రజా రవాణాధికారి మధుసూదన్ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో డిపో మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజ్ ఇన్‌చార్జులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి భక్తులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక సర్వీసులను అందుబాటులోకి తెస్తున్నట్లు పేర్కొన్నారు. మహానగరాలైన హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విజయవాడతో పాటు పలు ప్రాంతాల నుంచి తరలివచ్చే వారి కోసం ఈనెల 22, 23 తేదీల్లో 70 ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామన్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి ఇంకా సర్వీసులు పెంచుతామన్నారు. పుట్టపర్తి రైల్వేస్టేషన్ – పుట్టపర్తి మధ్య 10, కొత్తచెరువు – పుట్టపర్తి – బుక్కపట్నం మధ్య 10, ధర్మవరం రైల్వేస్టేషన్ – పుట్టపర్తి మధ్య 10, కదిరి– పుట్టపర్తి మధ్య 10, హిందూపురం – పుట్టపర్తి మధ్య 10 , పెనుకొండ – పుట్టపర్తి మధ్య 5, అనంతపురం – పుట్టపర్తి మధ్య 10, చెన్నై– పుట్టపర్తి మధ్య 2, హైదరాబాద్– పుట్టపర్తి మధ్య 2, బెంగుళూరు– పుట్టపర్తి మధ్య 2 సర్వీసులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. సత్యసాయి భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇనయతుల్లా, ట్రాఫిక్ ఇన్‌చార్జ్ పెద్దన్న, పార్థసారధిరెడ్డి, షాషావలి, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దుపై 'ప్రత్యేక శ్రద్ధ'



నిర్మాణంలో ఉన్న మడకశిర ఏరియా ఆస్పత్రి భవనాలు



మడకశిరలో అర్బన్ పీహెచ్‌సీని ఏర్పాటు చేసిన దృశ్యం

- ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట
- పెరిగిన మడకశిర ఆస్పత్రి స్థాయి
- ఇంతకు మునుపు సీహెచ్‌సీగా ఉన్న వైనం
- రొళ్ల పీహెచ్‌సీ స్థాయి కూడా పెంపు

మడకశిర: జిల్లాలోని మడకశిర నియోజకవర్గం పూర్తిగా కర్ణాటక సరిహద్దులో ఉంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని ప్రజలు మెరుగైన వైద్యం కోసం కర్ణాటకకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం కూడా సరిహద్దు ప్రజల ఆరోగ్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సరిహద్దు ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించింది.

మడకశిర ఆస్పత్రి స్థాయి పెంపు..

టీడీపీ హయాంలో మడకశిరలో సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్) ఉండేది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక మడకశిర ఆస్పత్రికి మహర్దశ వచ్చింది. ఎమ్మెల్యే తిప్పేస్వామి చొరవతో మడకశిర ఆస్పత్రి స్థాయిని ప్రభుత్వం పెంచింది. సీహెచ్‌సీ నుంచి ఏరియా ఆస్పత్రిగా స్థాయి పెరగడంతో పేదలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలందించడానికి అవకాశం ఏర్పడింది. 50 పడకల నుంచి 100 పడకలకు ఆస్పత్రి స్థాయిని పెంచిన ప్రభుత్వం అన్ని హంగులతో భవనాల నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టింది. అలాగే కొత్తగా 23 డాక్టర్ పోస్టులను మంజూరు చేసింది. అవసరమైన హెడ్ నర్సులు, నర్సులు, ఇతర సిబ్బంది తదితర పోస్టులను కూడా మంజూరు చేయడంతో నియోజకవర్గంలోని పేదలకు కార్పొరేట్ వైద్యసేవలందుతున్నాయి. ఫలితంగా పేదల ప్రజలపై ఆర్థిక భారం తగ్గి ఊరట లభించింది.

రూ.24 కోట్లతో ఆస్పత్రి భవనాలు..

మడకశిర ఆస్పత్రిస్థాయిని పెంచిన ప్రభుత్వం జాప్యం చేయకుండా అన్ని హంగులతో భవనాల నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేసింది. నాబార్డు ద్వారా భవనాల నిర్మాణానికి రూ.24 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో అన్ని హంగులతో భవనాల నిర్మాణం జోరుగా సాగుతోంది. ఈ భవనాలను వేగవంతంగా పూర్తి చేయడానికి ఏపీ ఎంహెచ్ఐడీసీ ఇంజినీరింగ్ విభాగం (ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) అధికారులు కృషి చేస్తున్నారు. ఈ భవన నిర్మాణ పనులు పూర్తి అయిన వెంటనే ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలను అందించనున్నారు.

రొళ్ల పీహెచ్‌సీ స్థాయి కూడా పెంపు..

రొళ్ల పీహెచ్‌సీ (అప్‌గ్రేడెడ్) స్థాయిని కూడా ప్రభుత్వం పెంచింది. సరిహద్దు ప్రజలకు వైద్య సేవలను మరింత దగ్గర చేయడానికి వీలుగా ప్రభుత్వం ఈచర్య చేపట్టింది. ఇంతకు మునుపు అప్‌గ్రేడెడ్ పీహెచ్‌సీగా ఉండేది. కేవలం 30 పడకలు మాత్రమే ఈపీహెచ్‌సీలో ఉండేవి. ఈ నేపథ్యంలో పేదలు ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించి ఈపీహెచ్‌సీని సీహెచ్‌సీగా చేసింది. 50 పడకల ఆస్పత్రిగా మార్చి డాక్టర్లు, హెడ్ నర్సులు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందిని కూడా పెంచింది.

మడకశిరలో అర్బన్ పీహెచ్‌సీ ఏర్పాటు..

టీడీపీ హయాంలో పట్టణ ప్రాంతాల్లో పీహెచ్‌సీలు లేవు. ఫలితంగా పట్టణ ప్రజలు ఇబ్బందులు పడేవారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వైద్య ఆరోగ్యరంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. పట్టణ ప్రాంతాల్లో కూడా పీహెచ్‌సీలు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే మడకశిరలో అర్బన్ పీహెచ్‌సీని ఏర్పాటు చేశారు. డాక్టర్లు, సిబ్బందిని నియమించారు. భవనాల నిర్మాణాన్ని కూడా పూర్తి చేశారు. నూతన భవనంలో పట్టణ ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి.

పల్లెల్లోనూ సులువుగా వైద్యసేవలు..

గ్రామీణ ప్రాంతాల్లో కూడా వైద్య సేవలను మరింత విస్తరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పలు గ్రామాలకు నూతన పీహెచ్‌సీలను కూడా కొత్తగా మంజూరు చేసింది. నియోజకవర్గంలో 9 పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటికి తోడుగా గుడిబండ మండలం మోరుబాగల్ కూడా ప్రభుత్వం కొత్త పీహెచ్‌సీని ఏర్పాటు చేసింది. భవన నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులను కూడా మంజూరు చేసింది. అలాగే మధూడి, రత్నగిరిలో కూడా పీహెచ్‌సీలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

పేదల ఆరోగ్యానికి పెద్దపీట



పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. టీడీపీ హయాంలో పేదలకు మెరుగైన వైద్య సేవలందేవి కావు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక పేద ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడం ఎంతో ఆనందంగా ఉంది. డాక్టర్లు ఇంటికే వచ్చి వైద్య సేవలందించడం గొప్ప విషయం. మడకశిర ప్రాంతంలో వైద్య సేవల మెరుగుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు భేష్.

– శ్రీనివాస్, హెచ్‌టీ హళ్లి, రొళ్ల

గతంలో పట్టించుకోలేదు



టీడీపీ హయాంలో మడకశిర ప్రాంతంలోని ఆస్పత్రులు అభివృద్ధికి నోచుకోలేదు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక మడకశిర ఆస్పత్రికి మహర్దశ ఏర్పడింది. ఆస్పత్రి స్థాయిని పెంచడమే కాకుండా భవన నిర్మాణానికి రూ.24 కోట్లు మంజూరు చేయడం గొప్ప విషయం.

– కరియన్న, సర్పంచు, హరేసముద్రం

అభ్యంతరాలు త్వరగా పరిష్కరించండి



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ చేతన్ తదితరులు

- కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ముసాయిదా ఓటరు జాబితాపై అందిన అభ్యంతరాలు, పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పెండింగ్ దరఖాస్తులు, ఓటర్ల జనాభా నిష్పత్తి, మార్పులు, చేర్పులపై సమీక్షించారు. అనంతరం కలెక్టరేట్‌లోని వీసీ హాల్లో అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ చేతన్, సబ్ కలెక్టర్ కార్తీక్‌లతో కలిసి కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ ఇటీవల ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితా నాటికి ఫారం-6లో 30 శాతం , ఫారం-7లో 15 శాతం , ఫారం-8లో 10 శాతం పెండింగ్ ఉందన్నారు. పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే పనిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణ, రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులు, మృతి చెందిన వారు, అడ్రస్ మార్పులు, డబుల్ ఎంట్రీలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి పరిష్కరించాలన్నారు. అలాగే మీడియాలో వచ్చిన వార్తలపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా యువ ఓటర్ల చేరికపై దృష్టి పెట్టాలన్నారు. మడకశిర నియోజకవర్గానికి ఎన్నికల అధికారిని నియమించాలన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి, కదిరి, ధర్మవరం ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి, ఎన్నికల అధికారులు భాస్కర్, మైనుద్దీన్ తదితరులు ఉన్నారు.

పాఠశాల విద్య ప్రాధాన్యతను గుర్తించాలి

పాఠశాల విద్య ప్రాధాన్యతను తల్లిదండ్రులు గుర్తించాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. గురువారం విజయవాడలోని సెక్రటేరియట్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమశాఖ, ప్రభుత్వ పథకాలు, ఎస్‌డీజీ లక్ష్యాలు, పాఠశాల విద్య, పరిశ్రమలు, టూరిజం ప్రాజెక్టులకు భూ సేకరణ, 'జగనన్నకు చెబుదాం' తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎస్‌కు కలెక్టర్ అరుణ్‌బాబు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వివిధ కారణాలతో బడి బయట ఉన్న విద్యార్థులను పాఠశాలలో చేర్చి విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఒకటి నుంచి ఇంటర్ వరకూ సుమారు 1.80 లక్షల మందిని చేర్పామన్నారు. అలాగే పది, ఇంటర్ ఫెయిలైన ప్రతి విద్యార్థినీ పాఠశాలలో చేర్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, ఏపీఓ ప్రకాష్‌రెడ్డి, టూరిజం మేనేజర్ ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలు

- డీఈఓ మీనాక్షి

ప్రశాంతి నిలయం/పుట్టపర్తి: పాఠశాలల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను నిబంధనలమేరకు రూపొందించాలని డీఈఓ మీనాక్షి సూచించారు. గురువారం కొత్తచెరువులోని బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మండలాల హెచ్ఎంలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అవసరాలను గుర్తించి వీటిని ఏవిధంగా సేకరించాలి, ఏ విధంగా క్రోడీకరించాలి అన్న అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఈఓ మీనాక్షి మాట్లాడుతూ పాఠశాలస్థాయి, ఆవాస ప్రాంతస్థాయి, మండలస్థాయి ప్రణాళికలను ఇచ్చిన టైమ్‌లైన్ ప్రకారం తయారు చేసి జిల్లా స్థాయికి చేర్చాలన్నారు. 2024-25, 2025-26 ఏడాదిలకు సంబంధించి అన్ని పాఠశాలల్లోనూ సమస్యలను గుర్తించి గ్రామాల్లో సభలను నిర్వహించాలన్నారు. గ్రామస్తుల నిర్ణయం మేరకు ఆయా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటుగా అన్ని రకాల వసతులను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు. తీర్మాణాలను తీసుకుని మండల స్థాయికి పంపాలన్నారు. కార్యక్రమంలో ఏడీ-1 నాగరాజు, ఏడీ-2 రామకృష్ణ, ఎంఈఓలు, 'నాడు-నేడు' నోడల్ అధికారి జయచంద్ర, ఏఎస్ఓ మస్తాన్, ఏపీఓ ప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



హెచ్ఎంలతో సమావేశమైన విద్యాశాఖ అధికారులు

పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ

కదిరి టౌన్: పట్టణంలోని బాలికల పాఠశాలను డీఈఓ మీనాక్షి గురువారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సరిగా లేకపోవడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటాచలంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని రుచి చూశారు. డీఈఓ వెంట ఎంఈఓ చెన్నక్రిష్ణ తదితరులున్నారు.



సంగీత కచేరీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అలరించిన సంగీత కచేరీ

ప్రశాంతి నిలయం: సత్యసాయిని కీర్తిస్తూ విద్యార్థులు నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను అలరించింది. సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ సంగీత విభాగం విద్యార్థులు గురువారం సత్యసాయి సన్నిధిలో సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయిపై భక్తిభావంతో వారు ఆలపించిన గీతాలతో సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీల్లో ఉరవకొండ విద్యార్థి ప్రతిభ


శిరీష

ఉరవకొండ: సత్యసాయి జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని గత నెల రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఉరవకొండ విద్యార్థిని విజేతగా నిలిచింది. 'మానవత్వాన్ని పెంపొందించు విద్యావశ్యకత' అంశంపై సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఉరవకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చివరి సంవత్సరం చదుతున్న శిరీష పాల్గొని బంగారు పతకాన్ని దక్కించుకుంది. ఈ నెల 21న పుట్టపర్తిలో జరిగే సత్యసాయి జయంతి ఉత్సవాల్లో ఆమె ఈ మెడల్‌ను అందుకోనున్నారు. ఈ మేరకు సత్యసాయి సంస్థల ఉమ్మడి ఏపీ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.అంజయ్య, అధ్యక్షుడు రామచంద్రమూర్తి, సేవా సమితి కన్వీనర్ దాశెట్టి రామాంజినేయులు తెలిపారు.

బస్సును ఢీకొన్న ఆటో


ప్రమాదానికి కారణమైన ఆటోను పరిశీలిస్తున్న పోలీసులు

నల్లచెరువు: ఆగి ఉన్న బస్సును ఆటో ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... నల్లచెరువు మండలం సంజీవపల్లికి చెందిన ఈశ్వరయ్య తన కుటుంబసభ్యులతో కలసి ఆటోలో బుధవారం కదిరి మండలం కుంట్లపల్లిలో బంధువుల ఇంట జరిగిన శుభకార్యానికి వెళ్లాడు. వివాహ తంతు ముగిసిన తర్వాత గురువారం స్వగ్రామానికి ఆటోలో బయలుదేరారు. రాత్నాలపల్లి బస్టాప్ వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక ఎదురుగా రోడ్డు పక్కన ఆపి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నారు. ఘటనలో ఆటో ముందు భాగం నుజ్జునుజ్జయింది. డ్రైవర్ ఈశ్వరయ్యతో పాటు కుటుంబసభ్యులు లక్ష్మీనరసమ్మ, కళావతి, వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన లక్ష్మీనరసమ్మకు మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచన మేరకు తిరుపతికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, అటుగా వెళుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ప్రమాదం జరిగిన ప్రాంతానికి చేరుకోగానే తన వాహనాన్ని ఆపి ఘటనపై ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఫోన్ ద్వారా వైద్యులకు సూచించారు.

వక్క.. ఉపాధి పక్కా



అమరాపురం మండలంలో వక్కను గెల నుంచి వేరు చేస్తున్న కూలీలు, వక్కను ఉడక బెడుతున్న దృశ్యం

- అమరాపురం మండలంలో అత్యధికంగా 3 వేల ఎకరాల్లో వక్క తోటలు
- వేలాది కుటుంబాలకు ఉపాధి

అమరాపురం: జిల్లాలో ఎక్కడా లేని విధంగా మడకశిర నియోజకవర్గంలో వక్క తోటలు వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. బోరుబావుల కింద వక్క తోటలను రైతులు సాగు చేయడంతో నిరంతరం కూలీలకు ఉపాధి ఉంటోంది. ముఖ్యంగా అమరాపురం మండలంలో అత్యధికంగా 3 వేల ఎకరాలకు పైగా భూముల్లో వక్క తోటలను రైతులు సాగు చేశారు. ఏటా జూలైలో కోతలు మొదలై ఆరు నెలల పాటు చేతినిండా పని ఉంటోంది. కోత కోయడం మొదలు గెలను వేరు చేయడం, పచ్చి వక్కను యంత్రం వేసి తోలు వేరు చేయడం, అనంతరం మహిళా కూలీలతో శుభ్రం చేయించడం, చివరకు వక్కను తీసుకుని బాగా మరగించి టార్పలిన్‌పై ఆర బెడతారు. దాదాపు వారం రోజుల పాటు ఎండిన తర్వాత సంచుల్లో నింపి మార్కెట్‌కు తరలిస్తారు. ఈ మొత్తం ప్రక్రియ కూలీలపైనే ఆధారపడి సాగుతుంది. ఉదయం నుంచి సాయంకాలం వరకూ చేస్తే పురుషులకు రూ.600, మహిళలకు రూ.300 చొప్పున కూలి చెల్లిస్తారు.

నెలకు రూ.18 వేలు



వక్క తోటలతో రోజూ చేతినిండా పని దొరుకుతోంది. ఉదయం నుంచి సాయంకాలం వరకూ పని చేస్తా. భోజనం పెట్టి రూ.600 ఇస్తారు. నెలకు రూ.18 వేలు సంపాదనతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా.

– హనుమంతరాయ, కూలీ, తమ్మడేపల్లి, అమరాపురం మండలం.



ఇప్పటికీ పనికి వెళతా



నాకు ప్రస్తుతం 62 సంవత్సరాలు. సామాజిక పింఛన్ వస్తుంది. అయితే ఇంట్లో పొద్దుపోదు. దీంతో ఈ వయసులోనూ కూలి పనులకు వెళుతుంటాను. వక్క తోటల్లో పనికి రోజూ రూ.600 కూలి వస్తోంది. వారానికి ఓ రోజు ఇంటి పట్టనే ఉంటాను.

– హనుమంతప్ప, కూలీ, అమరాపురం

రోజూ పనే



మా మండలంలో వక్క తోటల్లో అంతర పంటగా తమలపాకు తోటలు ఉన్నాయి. దీంతో ఏడాది పొడవునా రోజూ ఏదో ఒక పని దొరుకుతోంది. ఇంటి వద్ద ఖాళీగా ఉండలేక కూలి పనులకు వెళుతుంటాను. దీంతో కుటుంబ ఆదాయం పెరుగుతోంది.

– సత్యనారాయణ, కూలీ, నగోనపల్లి, అమరాపురం మండలం

ఎద్దుకు అరుదైన ఆపరేషన్


ఎద్దుకు ఆపరేషన్ చేసిన పశు వైద్యాధికారులు

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖ, 1962 వైఎస్సార్ మొబైల్ అంబులేటరీ క్లినిక్ సిబ్బంది పశువైద్య సేవలు మరింత విస్తరించాయి. మూగజీవుల ప్రాణాలను సైతం విలువైనవిగా భావించి అరుదైన శస్త్రచికిత్సలతో జీవం పోస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమున్నత ఆశయంతో అందుబాటులోకి తీసుకువచ్చిన 1962 హెల్ప్‌లైన్ మొబైల్ అంబులెన్స్ సేవలు నూతన ఒరవడికి నాంది పలికాయి. ఏడాది కాలంగా ఎన్నో కష్టసాధ్యమైన అరుదైన శస్త్రచికిత్సలు నిర్వహించిన పశు వైద్య బృందం తాజాగా మరో సంక్లిష్టమైన ఆపరేషన్‌తో ఓ ఎద్దుకు జీవం పోసింది. వివరాలు...

బెళుగుప్ప మండలం దుద్దేకుంటకు చెందిన రైతు వెంకటేశు బుధవారం ఉదయం 1962 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి మూడు రోజులుగా మూత్రం బయటకు రాక తన ఎద్దు తీవ్ర ఇబ్బంది పడుతోందని తెలిపాడు. వెంటనే అప్రమత్తమైన అంబులెన్స్ డాక్టరు, సిబ్బంది అక్కడకు చేరుకుని ఎద్దును పరీక్షించారు. శస్త్రచికిత్స అవసరం కావడంతో 1962 వాహనంలో అనంతపురం పశువైద్యశాలకు తీసుకువచ్చారు. మూత్ర నాళాలలో రాళ్లు అడ్డుపడటం వల్ల ఉచ్చ ఉత్పత్తి ఆగిపోయినట్లు గుర్తించి ఆపరేషన్ తప్ప మరో మార్గం లేదని నిర్ధారించారు. అయితే శస్త్రచికిత్స తర్వాత ఫలితం ఎలా ఉంటుందో చెప్పలేమని రైతుకు నచ్చచెప్పి ఈ క్రమంలో శస్త్రచికిత్సలు చేయడంలో మంచి అనుభవం కలిగిన శింగనమల పశువైద్యశాల ఏడీ డాక్టర్ జి.పద్మనాభం నేతృత్వంలో నాలుగు గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్స చేశారు. మూడు రోజులుగా పేరుకుపోయిన దాదాపు 30 లీటర్ల వరకు మూత్రాన్ని వెలికి తీశారు. అనంతరం మూత్రాశయం నుంచి నేరుగా మూత్రం బయటకు రావడానికి తాత్కాలికంగా ఫోలేస్ క్యాథెటర్ అమర్చారు. ఎద్దు పూర్తిగా కోలుకునేందుకు 14 రోజులు సమయం పడుతుందని అప్పటి వరకూ చాలా జాగ్రత్తగా చూసుకోవాలని రైతుకు సూచించి, అవసరమైన మందులు, ఇతర సామగ్రిని అందజేశారు. ఈ అరుదైన శస్త్రచికిత్సలో ఏడీ డాక్టర్ సురేష్, 1962 డాక్టర్లు డాక్టర్ సునీత, డాక్టర్ సుచరిత, డాక్టర్ గాయత్రి, పారావెట్స్ దివ్యశ్రీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు. కష్టసాధ్యమైన శస్త్రచికిత్సతో ఎద్దు ప్రాణాలు కాపాడిన వైద్య బృందాన్ని పశుశాఖ జిల్లా అధికారులు డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ వై.రమేష్‌రెడ్డి తదితరులు అభినందించారు.

రామగిరి ఎంపీపీగా మీనుగ నాగమ్మ

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులు


ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న మీనుగ నాగమ్మ

రామగిరి: మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలిగా మీనుగ నాగమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం చేపట్టిన ఎన్నికల ప్రక్రియను స్పెషలాఫీసర్ సంజీవయ్య, ఎంపీడీఓ ఫజిల్‌బాషా, ఈఓఆర్డీ రాధాకృష్ణ పర్యవేక్షించారు. 10మంది ఎంపీటీసీ సభ్యులుండగా నసనకోట ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుడు గైర్హాజరయ్యారు. మిగిలిన వారందరూ హాజరై ఏకగ్రీవంగా మద్దతు తెలపడంతో మీనుగ నాగమ్మ ఎంపిక లాంఛనమే అయింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ చిన్నగౌస్, ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మీనుగ నాగమ్మ ఎంపికపై సర్పంచ్ మీనుగ నాగరాజు, ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాలప్ప, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, నరసింహారెడ్డి, కర్రెన్న, సంపత్‌కుమార్, ఆదిరెడ్డి, ఓబిరెడ్డి, సూరి, శ్రీరాంనాయక్, మోహన్‌బాబు, నారపరెడ్డి, రామ్మోహన్ తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను ఘనంగా సన్మానించారు.

నేడు ఎమ్మెల్యే, ఎంపీ రాక..

ఎంపీపీగా మీనుగ నాగమ్మ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ గోరంట్లమాధవ్, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.

శ్రీగంధం చెట్టు కొట్టేసిన కేసులో నిందితుల అరెస్ట్

- రూ.95 వేలు విలువ చేసే 15 దుంగలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాదరెడ్డి (చిత్రంలో) సీఐలు శివరాముడు, జీటీనాయుడు

అనంతపురం క్రైం: జిల్లా కేంద్రం నడిబొడ్డున, ఎస్పీ క్యాంప్ కార్యాలయం పక్కనే ఉన్న అటవీశాఖ భవనంలో ఉన్న శ్రీగంధం చెట్టును కొట్టి ఎత్తుకెళ్లిన ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను గురువారం డీఎస్పీ ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మధ్యప్రదేశ్‌లోని కట్నీ జిల్లా కూడే గ్రామానికి చెందిన అభి, సంగం పార్ధీ, ఓ మైనర్ బాలుడు కలసి నగరంలోని అటవీశాఖ అధికారి బంగ్లా ఆవరణలో ఉన్న శ్రీగంధంచెట్టును 2023లో కొట్టి దుంగలు అపహరించుకెళ్లారు. ఘటనపై అప్పట్లో అనంతపురం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. రుద్రాక్షలు సేకరించి ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల్లో సంచరిస్తూ విక్రయించేవారు. ఈ క్రమంలో తమకు కనిపించిన విలువైన శ్రీగంధం, ఎర్రచందనం చెట్లను రాత్రికి రాత్రి కోసేసి దుంగలను తరలించుకెళ్లేవారు. అనంతపురంలో ఐదు, శ్రీసత్యసాయి జిల్లాలో ఓ చెట్టును కోసి దుంగలను తరలించారు. గురువారం ఉదయం ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న ముళ్ల పొదల్లో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ముగ్గురినీ పోలీసులు అదుపులోకి తీసుకువని విచారణ చేయడంతో శ్రీగంధం చెట్ల కొట్టి వేత వెలుగులోకి వచ్చింది. వీరి నుంచి రూ.95 వేలు విలువ చేసే 30 కిలోల బరువున్న 15 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

చేనేత కార్మికుడి బలవన్మరణం

ధర్మవరం రూరల్: స్థానిక దుర్గానగర్‌కు చెందిన చేనేత కార్మికుడు శ్రీనివాసులు(45) ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు... భార్య జయసుధతో కలసి శ్రీనివాసులు కూలి మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లోనే శ్రీనివాసులు ఉరి వేసుకున్నాడు. సమీపంలో ఉన్న కుటుంబసభ్యులు గమనించి వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆటోబోల్తా - వ్యక్తి మృతి

గుంతకల్లు రూరల్: ఆటో బోల్తాపడిన ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం వెంకటాంపల్లి నివాసి వెంకటేష్ (57)కు భార్య నాగలక్ష్మి, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లు చేశారు. వ్యవసాయంతో పాటు కూలి పనులతో జీవనం సాగించే వెంకటేష్ గురువారం ఉదయం నాగసముద్రం గ్రామంలో వ్యవసాయ పనులకు వెళ్లాడు. పని ముగించుకుని సాయంత్రం ఆటోలో తిరుగు ప్రయాణమైన ఆయన మరికాసేపట్లో గ్రామానికి చేరుకుంటుండగా డ్రైవర్ వేగ నియంత్రణ కోల్పోవడంతో ఆటో బోల్తాపడింది. ఘటనలో తలకు తీవ్రగాయమైన వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనపై గుంతకల్లు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రైలు నుంచి జారిపడి.....

తాడిపత్రి టౌన్: మండలంలోని చల్లవారిపల్లి సమీపంలో రైలు నుంచి జారి పడి పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లికి చెందిన మహబూబ్ బాషా (38) మృతి చెందాడు. రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద లభ్యమైన ఆధారాలను బట్టి మహబూబ్‌బాషాగా నిర్ధారించుకుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కాగా, మహబూబ్‌బాషా వైఎస్సార్ జిల్లా యర్రగుంట్లలో కూలి పనులు చేసేవాడని, స్వగ్రామానికి రైలులో వస్తూ ప్రమాదవశాత్తు కింద పడి మరణించి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి.

పురుగు ఉధృతిని బట్టి మందుల పిచికారీ

- కందికి నీటి తడులు అందిస్తే మంచి దిగుబడులు
- ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య


రొద్దంలో కందికి మందులు పిచికారీ చేస్తున్న రైతు

పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది పంటకు పలు రకాల పురుగులు ఆశిస్తున్నాయని వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ మందులు పిచికారీ చేసుకుంటే మంచి దిగుబడులు ఉంటాయని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య తెలిపారు. జిల్లాలో సాగైన కంది పంట పూత, పిందె దశలో ఉందన్నారు. సాళ్ల మధ్యలో ఉన్న పిచ్చి గడ్డి తొలగించి బెట్ట సోకిన ప్రాంతంలో నీటి తడులు అందిస్తే 50 శాతానికి పైగా దిగుబడి పెరుగుతుందన్నారు. అక్కడక్కడ రైతులు పొలాల్లో కంది మాత్రం సాగు చేయగా, మరికొందరు అంతర పంటగా సాగు చేశారన్నారు. ముఖ్యంగా శనగ పచ్చ పురుగు, మారుక మచ్చల పురుగు, పాడ్‌ఫ్లై వంటి పురుగులు ఆశిస్తున్నట్లుగా తెలిపారు. వీటి నివారణకు చేపట్టాల్సిన చర్యలను ఆయన వివరించారు.

- కంది పంటను ఆశించే పురుగు ఉధృతిని బట్టి మందుల పిచికారీ చేయాలి.
- వ్యవసాయాధికారులు సూచించిన మోతాదులోనే మందులు వాడాలి.
- కంది పంట పూత దశలో ఉంటే ఒక లీటరు నీటికి క్లోరోపైరిపాస్ 2.5 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలి.
- పిందె దశలో ఉంటే ఒక లీటరు నీటికి నీమ్ ఆయిల్ 5 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలి.
- కాయ దశలో ఉంటే ఒక లీటరు నీటికి క్వినాల్‌పాస్ 2 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలి.
- శనగపచ్చ పురుగు ఆశిస్తే లీటరు నీటికి క్వినాల్ పాస్ 2 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే లీటరు నీటికి నవలురాన్ 1 ఎంఎల్ పిచికారీ చేయాలి.
- మారుకమచ్చల పురుగు ఆశిస్తే ఎకరాకు స్పైనోసాడ్ మందును 60 ఎంఎల్, లేదా ఇండిక్సాకార్బన్ 60 ఎంఎల్ మందును పిచికారీ చేయాలి.

జనవాక్కు

సొంతిల్లు దక్కింది



ఎన్నో ఏళ్లుగా సొంతిల్లు లేకుండా ఇబ్బంది పడుతున్నాం. గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులను ప్రాధేయపడినా ఎవరూ పట్టించుకోలేదు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత వలంటీర్లే మా ఇంటి వద్దకు వచ్చి వివరాలు తీసుకెళ్లి ఇంటి పట్టా అందేలా చేశారు. బిల్లులు సక్రమంగా అందించారు. దీంతో సొంతిల్లు నిర్మాణం వేగంగా సాగుతోంది. మాలాంటి నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– వెంకటలక్ష్మమ్మ, కరావులపల్లి, గోరంట్ల మండలం

కీడుకన్నా మేలే ఎక్కువ



విద్యారంగం బలోపేతానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సంస్కరణలతో కీడుకన్నా మేలే ఎక్కువగా జరుగుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉపాధ్యాయులు కచ్చితంగా విధులకు హాజరవుతున్నారు. పాఠ్యాంశాల బోధన మెరుగుపడింది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులూ రూపుదిద్దుకున్నాయి. పరీక్ష ఫలితాలు సైతం మెరుగుపడ్డాయి.

– పెద్దారెడ్డి, ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్‌ఎస్, చిలమత్తూరు

అప్పట్లో ఎవరూ పట్టించుకోలేదు



గత ప్రభుత్వ హయాంలో చాలా సమస్యలతో ఇబ్బంది పడ్డాం. వాటి పరిష్కారానికి అర్జీల మీద అర్జీలు ఇచ్చినా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. మాబోటి పేదలు ఇంటి పట్టాల కోసం చేయని పోరాటమంటూ లేదు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రభుత్వ కార్యాలయం మెట్టు కూడా ఎక్కకుండానే వలంటీరే ఇంటి వద్దకు వచ్చి వివరాలు తీసుకెళ్లి ఇంటి పట్టా వచ్చేలా చేశాడు. అంతేకాదు ఇల్లు కట్టుకునేందుకు రూ.1.80 లక్షల ఆర్థిక సాయం కూడా ప్రభుత్వం అందజేసింది. బిల్లులు సైతం సకాలంలో మంజూరు చేశారు. ఇప్పుడు సొంతింట్లో ఎంతో సంతోషంగా ఉంటున్నాం. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– చందన, బుచ్చయ్యగారిపల్లి, బుక్కపట్నం మండలం

గుండె పరీక్షలు ఉచితంగా చేశారు



కొన్నేళ్లుగా గుండె జబ్బుతో బాధపడుతున్నా.. పరీక్షలు చేయించుకునే ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడ్డాను. ఖరీదైన మాత్రలు కొనలేని పరిస్థితి నాది. అయితే జగనన్న ఆరోగ్య సురక్షలో చికిత్స కోసం వెళితే పరీక్షించిన వైద్యులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడికెళ్లితే గుండె సంబంధిత అన్ని రకాల పరీక్షలు ఉచితంగా చేశారు. భయపడాల్సిన పనేమీ లేదని, మందులు ఉచితంగా ఇచ్చి పంపారు. ఖరీదైన వైద్య పరీక్షలు ఉచితంగా అందజేసిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– ఖాజాపీరా, 1వ వార్డు, ఉరవకొండ

ద్విచక్ర వాహనం అపహరణ

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో ఉంచిన ద్విచక్ర వాహనాన్ని దుండగుడు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం వెంకటకొండాపురం నివాసి రామాంజనేయులు తన స్నేహితుడితో కలసి ఈ నెల 14న ద్విచక్ర వాహనంపై కసాపురం చేరుకుని హనుమద్ దీక్ష స్వీకరించారు. ఈ క్రమంలో రెండు రోజుల పాటు స్వామి సన్నిధిలోనే నిద్ర చేయాలని భావించిన వీరికి మరో దీక్షాపరుడు తనకు తానుగా పరిచయం చేసుకుని వారితో కలసి పోయాడు. గురువారం ఉదయం ముగ్గురూ కలసి స్వామి దర్శనానికి వెళ్లారు. ఈ క్రమంలో స్నేహితులిద్దరూ ఆలయం ఆలయం చుట్టూ ప్రదక్షిణల్లో నిమగ్నమైపోగా, తనకు ఓపిక లేదంటూ బయటకు వచ్చిన యువకుడు లగేజీ బ్యాగ్‌లతో పాటు మొబైల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని అపహరించుకెళ్లాడు. దర్శనం చేసుకుని బయటకు వచ్చిన రామాంజినేయులు లగేజీతో పాటు ద్విచక్ర వాహనం కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ పుటేజీలను పరిశీలించిన పోలీసులు రెండు రోజుల పాటు వారితో గడిపిన యువకుడే అపహరించుకెళ్లినట్లుగా గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థి దుర్మరణం

బుక్కరాయసముద్రం: ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి ఓ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... బీకేఎస్ మండలం కేకే అగ్రహారం గ్రామానికి చెందిన భూషణ, మహాలక్ష్మి దంపతులు ఇటీవల మండల కేంద్రానికి వలస వచ్చారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. భూషణ కూలి పనులతో జీవనం సాగిస్తుండగా, స్వగ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తగా మహాలక్ష్మి పనిచేస్తోంది. బీకేఎస్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కుమారుడు రామ్‌చరణ్ (15) గురువారం కొట్టాలపల్లిలో ఉన్న స్నేహితుడి వద్దకెళ్లి పుస్తకాలు తీసుకుని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. బీకేఎస్‌లోని పోతులయ్య స్వామి గుడి వద్దకు చేరుకోగానే వేగంగా దూసుకొచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ఘటనలో రోడ్డుపై పడిన రామ్‌చరణ్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.